www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 21 మే 2025

5

పశ్చిమ గోదావరి

నేడు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ రాక

భీమవరం : రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఈనెల 21 బుధవారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా సమాచార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. విజయవాడ నుంచి బయలుదేరి ఉదయం 11 గంటలకు భీమవరం చేరుకోనున్నారు. అనంతరం భీమవరం ఏరియా ఆసుపత్రిని సందర్శించి ఆరోగ్య మౌలిక సదుపాయాల సమీక్ష, సిబ్బందితో సంభాషిస్తారు. అర్బన్ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించడం – పోషకాహార చార్ట్, రికార్డుల తనిఖీ, అంగన్వాడీ వర్కర్లతో పిల్లలతో సంభాషిస్తారు. ఉదయం యోగా సెషన్ సెలెక్టర్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు. యోగాలో పాల్గొనే వారితో మాట్లాడి [illegible] దీపం పథకం పొందుతున్న లబ్ధిదారుని గృహాన్ని క్షేత్రస్థాయిలో సందర్శిస్తారు. ధాన్యం సేకరణ కేంద్రాన్ని సందర్శించడం, నాణ్యత తనిఖీ, స్టాక్ స్థితి గురించి రైతులతో మాట్లాడతారు. హౌసింగ్ లేఅవుట్ సందర్శన, లబ్ధిదారులతో ముఖాముఖి, జిల్లా అధికారులతో సమావేశం కానున్నారు. కాళ్ల మండలం కోపల్లెలో రాత్రి బస చేయనున్నట్లు జిల్లా సమాచార శాఖ తెలిపింది.

ముందస్తు సాగుపై ప్రణాళిక ఏదీ..!

ఖరీఫ్ సాగుపై అంతటా అయోమయం
జూన్ ఒకటో తేదీన సాగునీటి విడుదలపై నీలినీడలు
రుతుపవనాలు ముందుగా రానున్నట్లు వాతావరణశాఖ ప్రకటన
ఖరీఫ్ ముందస్తుగా సాగితే తుపాన్ల గండం నుంచి రైతులకు ఊరట
గతంలో దీనిపై పెద్దఎత్తున ప్రచారం.. నేడు ఆ ఊసే కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ముందస్తు సాగుపై ప్రభుత్వం వద్ద ప్రణాళిక కనిపించడం లేదు. ముందస్తు సాగుపై గతంలో అనేక ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం ఇప్పుడు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. పంటకాలువలకు సాగునీటి విడుదలపైనా ఇప్పటికీ తేదీని ప్రకటించని పరిస్థితి ఉంది. రైతులకు మేలు చేసే ఖరీఫ్ ముందస్తు సాగుపై ప్రభుత్వం ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. రానున్న ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాలో రెండు లక్షలు, పశ్చిమలో 2.10 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టనున్నారు. అందుకు సంబంధించిన విత్తనాలు వంటివి ఇప్పటికే సిద్ధం చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సాగు ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో మాత్రం తెలియని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సాగు ఆలస్యంతో నవంబర్ నెలాఖరుకుగాని కోతలు రావడం లేదు. దీంతో పంటలు తుపాన్ల బారిన పడి రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. దీంతో 2014-19 మధ్యకాలంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ముందస్తు సాగుకు ప్రభుత్వం పూనుకుంది. జూన్ ఒకటో తేదీనే పంట కాలువకు సాగునీరు విడుదల చేసి, ముందుగా ఖరీఫ్ సాగు ప్రారంభించేందుకు రైతులను సమాయత్తం చేసే కార్యక్రమాలు చేపట్టింది. దీనిలో భాగంగానే ఏరువాక కార్యక్రమాన్ని ప్రభుత్వం పెద్దఎత్తున నిర్వహించింది. వైసిపి ప్రభుత్వం సైతం జూన్ ఒకటిన కాలువలకు సాగునీరు విడుదల చేసి ముందస్తు సాగుకు ప్రయత్నాలు చేసింది. రుతుపవనాలు ఆలస్యం కావడంతో కొన్నిసార్లు సాగు ముందుకు సాగని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఈ ఏడాది మే 28వ తేదీ నాటికే కోస్తాంధ్ర అంతటా రుతుపవనాలు ప్రవేశించనున్నట్లు వాతావరణశాఖ చెబుతోంది. గడిచిన పదేళ్లలో ఇటువంటి సానుకూల పరిణామం లేదని సైతం చెబుతున్న పరిస్థితి. ఇప్పటికే ప్రతిరోజూ వర్షాలు కురుస్తుండటంతో భూమి సైతం చల్లబడిన పరిస్థితి. వాతావరణం అనుకూలంగా ఉన్న తరుణంలో ముందస్తు సాగుపై ఎటువంటి ప్రణాళికలూ లేకుండాపోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.

పంట కాలువలకు సాగు నీరు వదిలితే ముందస్తు సాగుకు అవకాశం

గడిచిన పదేళ్లుగా పంట కాలువలకు ప్రతియేటా జూన్ ఒకటో తేదీన సాగునీరు విడుదల చేస్తూ వస్తున్నారు. ఈసారి అటువంటి పరిస్థితి కన్పించడం లేదు. ఇప్పటికీ సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తారో అధికారికంగా ప్రకటించలేదు. జూన్ మొదటివారంలో విడుదల చేసే అవకాశం ఉన్నట్లు మాత్రం చెబుతున్నారు. గతంలోకంటే సాగునీటి విడుదల ఆలస్యం కానున్నట్లు స్పష్టమవుతోంది. అదే జరిగితే ఖరీఫ్ సాగు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది. జూన్‌లో నారుమడులు పూర్తయితే నాట్లు త్వరగా పూర్తవుతాయి. దీంతో మాసూళ్లు ముందుగా వచ్చి తుపాన్లు, ముంపు నుంచి రైతులు తప్పించుకునే అవకాశం ఉంటుంది. ముందస్తు సాగు చేయాలంటే రైతులకు ముందుగా పూర్తి అవగాహన కల్పించాలి. గ్రామసభలు నిర్వహించి వివరించాలి. ఇప్పటి వరకూ అటువంటి చర్యలు ఏమీ కన్పించడం లేదు. ఖరీఫ్ సాగు ఆలస్యమైతే ఆ ప్రభావం రబీ సాగుపైనా పడుతోంది. జనవరి నెలాఖరు వరకూ రబీ నాట్లు పూర్తి కావడం లేదు. దీంతో సాగునీటి సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మే నెలాఖరు వరకూ రబీ మాసూళ్లు సాగుతున్నాయి. దీంతో మే నెలలో అకాల వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత రబీలోనూ అదే పరిస్థితి ఎదురైంది. వాతావరణం అనుకూలంగా ఉన్న తరుణంలో ఖరీఫ్ ముందస్తు సాగుకు ప్రణాళికలు రూపొందిస్తే రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ముందస్తు సాగుకు అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక రేషన్ దుకాణాల్లోనే సరుకులు

జూన్ ఒకటి నుంచి రేషన్ వాహనాలు నిలిపివేత
ఏలూరు జిల్లాలో 395, పశ్చిమలో 356 వాహనాలు
వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు మాత్రమే ఇంటి వద్దే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత ప్రభుత్వం తెచ్చిన ఇంటింటికీ రేషన్ అందించే ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. జూన్ ఒకటో తేదీ నుంచి ఇది అమల్లోకి రానున్నట్లు తెలిపింది. మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇక నుంచి రేషన్ కార్డుదారులంతా రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి బియ్యం, ఇతర సరుకులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఏలూరు జిల్లాలో 6.31 లక్షల వరకూ తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి. 395 రేషన్ వాహనాల ద్వారా ప్రతినెలా బియ్యం, సరుకుల పంపిణీ జరుగుతోంది. పశ్చిమలో 5.67 లక్షల రేషన్ కార్డులు ఉండగా 356 వాహనాల ద్వారా రేషన్ సరుకులు అందిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఇంటింటికీ రేషన్ పంపిణీ పూర్తిగా నిలిచిపోనుంది. ఇక నుంచి ఏలూరు జిల్లాలో 1,123 రేషన్ దుకాణాల్లోనూ, పశ్చిమలో 1,052 దుకాణాల్లోనూ రేషన్ సరుకుల పంపిణీ జరగనుంది. ఇంటింటికీ రేషన్ పంపిణీపై ఆదిలో విమర్శలు వెల్లువెత్తినప్పటికీ ఇప్పుడు అంతా అలవాటు పడ్డారు. ప్రభుత్వం ఒక్కసారిగా రేషన్ వాహనాలు నిలిపివేయడంతో జనం మరోసారి ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అయితే రేషన్ వాహనాలను నిలిపివేసిన తర్వాత ఇది ఎలా సాధ్యమో తెలియని పరిస్థితి ఉంది. రేషన్ వాహనాలను ప్రస్తుతం నిర్వహిస్తున్న లబ్ధిదారులకే ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. రేషన్ వాహనాల నిలిపివేతపై జనం నుంచి ఎటువంటి స్పందన వస్తుందో వేచిచూడాలి.

పలుచోట్ల వర్షం

21 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - ఆచంట

జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున పలుచోట్ల వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడి జనం సేదదీరారు. ఉక్కపోత తగ్గిందని జనం హర్షం వ్యక్తం చేశారు.

ఆచంట మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు వర్షం కురిసింది. వారం రోజులుగా ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలకు ఈ వర్షంతో కాస్త ఉపశమనం లభించింది. ఈ నేపథ్యంలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకూ విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఆచంట, కొడమంచిలి, వల్లూరు, కరుగోరుమిల్లి కాలనీల్లో డ్రెయిన్లలో నీరు రోడ్లపైకి ప్రవహించింది. దీంతో ఆయా కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆచంటలో కురుస్తున్న వర్షం

21 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదు

భీమవరం: జిల్లాలో సగటు వర్షపాతం 21 మిల్లీమీటర్లుగా నమోదైంది. తాడేపల్లిగూడెంలో 1.4, పెంటపాడులో 14.6, తణుకులో 15.2, అత్తిలిలో 27.8, గణపవరంలో 10.4, ఆకివీడులో 19.8, ఉండిలో 21.2, పాలకోడేరులో 30.4, పెనుమంట్రలో 10.4, ఇరగవరంలో 10, పెనుగొండలో 10.8, ఆచంటలో 20.2, పోడూరులో 33.2, వీరవాసరంలో 35, భీమవరంలో 29.6, కాళ్లలో 42.2, మొగల్తూరులో 25.6, నరసాపురంలో 23.6, పాలకొల్లులో 30.2, యలమంచిలిలో 8.4 మిల్లీమీటర్లు చొప్పున మొత్తం 420 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు తేలికపాటి భారీ వర్షం పడింది. తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో వర్షం దంచికొట్టింది. ఈరోజు వివాహ వేడుకలు ఉన్నాయి. మండు వేసవిలో వర్షం ఏమిటని నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. ఇంకా పాలకొల్లు నియోజకవర్గంలో రైతులు ఖరీఫ్ పంట పూర్తిగా ఒబ్బిడి చేసుకోవలసి ఉంది. వారు అకాల వర్షంకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరిగి సాయంత్రం 8 గంటల నుంచి తేలికపాటి వర్షం పడింది.

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరు

కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యాన నిరసనలు

భీమవరంలో..

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, కార్మికులకు హాని కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేసేంత వరకూ పోరాటం సాగిస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు స్పష్టం చేశారు. భీమవరంలో కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ఉగ్రవాద చర్యలను నిరసిస్తూ ఈ నెల 20న కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెను వాయిదా వేసినట్లు తెలిపారు. జులై 9న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించాలని నిర్ణయించారన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా రూపొందించిన లేబర్ కోడ్‌లు రద్దయితే తప్ప సమస్య పరిష్కారం కాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, కార్మికులు అన్ని తరగతుల ప్రజానీకాన్ని మోసగిస్తుందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరపై చట్టం చేస్తామని వాగ్దానం చేసి అమలు చేయలేదన్నారు. నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటున్నామని పైకి చెప్పినా, చాప కింద నీరులా అమలు చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న దేశవ్యాప్త సమ్మెలో అన్ని తరగతుల ప్రజానీకం పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్ ఎం ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డేగల నాగేశ్వరరావు, కలిపిండి సత్యనారాయణ, కురిటి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోలీస్ ఐల్యాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలు ప్రభుత్వాల దయా దాక్షిణ్యాలతో వచ్చినవి కావని, కార్మికుల అలుపెరగని పోరాటాలతో తమ హక్కులను సాధించుకున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించాలని పిలుపునిచ్చారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికులందరూ బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను, నేతలు సత్తి కోదండ రామిరెడ్డి, దేశంశెట్టి సతీష్, అయినాల సత్యనారాయణ, నరమాల కృష్ణ, పట్టణ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

తణుకు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో జోరు వర్షంలోనూ ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపీ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఈ దేశాన్ని ముందుకు నడిపిస్తున్న కార్మిక, ఉద్యోగులతో అధర్మ యుద్ధం చేయడం బాధాకరమన్నారు. అన్ని ధరలు పెంచుతున్నప్పుడు కనీస వేతనం రూ.26 వేలు ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రమేష్, అంబటి బ్రమ్మాజీ, మందులయ్య, నాగరత్నం, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం: లేబర్ కోడ్స్‌కు నిరసనగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరన తెలిపారు. అనంతరం తహశీల్దార్ ఎం.సుందర్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.కుమారి, జి.శ్రీదేవి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు హేమలత, డి.పద్మ, గీత కార్మిక సంఘం నాయకులు పాలా సత్యనారాయణ, పెచ్చెట్టి సుబ్బారావు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, ఉపాధి హామీ నాయకులు కొప్పిశెట్టి రామకష్ణ, కొప్పిశెట్టి కుమారి పాల్గొన్నారు.

తణుకులో..

నరసాపురం: లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మిక వర్గం పోరాటం చేస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్లో లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడగా నాయకులు కోడి లక్ష్మణ్, పొన్నాడ మల్లేష్, సందక దుర్గారావు, కె.సోమేశ్వరరావు, పైలా సత్తిబాబు, పైలా ప్రసాద్ జగన్ పాల్గొన్నారు.

నరసాపురంలో

పెనుగొండ: నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పెనుగొండ గ్రామపంచాయతీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్షులు నాగశెట్టి గంగారావు, సహాయ కార్యదర్శి కానూరు తులసి, అంగన్వాడీ, ఆశా, ఐకెపి, తాపీ కార్మికులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ పోరు ఆగదని సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు మాట్లాడగా కార్యక్రమంలో గంటి ఆంజనేయులు, మాదాసు లక్ష్మణరావు, బొంతు నాగరాజు, చింతపల్లి అప్పారావు, కుడిపూడి శ్రీరామచంద్ర, బొంతు కొండ, జోగి నాగరాజు, శీలం శ్రీను, పాలపర్తి సత్తిబాబు, బి.ఏసు, రొక్కాల శ్రీను పాల్గొన్నారు.

ఆకివీడు: లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ జులై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి తవిటినాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిరసన చేపట్టారు. సిఐటియు మండలాధ్యక్షులు పెంకి అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో తవిటి నాయుడు మాట్లాడగా, నెల్లి సూరిబాబు, నిమ్మల శ్రీను, నక్కానీ సత్యనారాయణ, దండు వాసురాజు, ఎన్.రమేష్ పాల్గొన్నారు.

ఆకివీడులో

10న ఆక్వా రైతుల చలో అమరావతి

జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఆక్వా రైతుల సమస్యలు ప్రభుత్వానికి తెలిసేలా జూన్ 10న చలో అమరావతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జైభారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని చందపర్రు గ్రామంలో గల కళ్యాణ మండపంలో జైభారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం కార్యవర్గ సమావేశం గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ రాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు రొయ్య సరైన ధర లేక, మేత ధరలు విపరీతంగా పెరిగి రైతు తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాడని, ఇప్పటికే 20 వేల ఎకరాలు రైతు సంఘం పిలుపుతో పంట విరామంగా ప్రకటించామన్నారు. నర్సాపురం, ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున ఆక్వా రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి మా సమస్యలు చేరే విధంగా మా కార్యాచరణ ఉంటుందని విలేకరులకు తెలియజేశారు. ఆక్వారంగంపై ఆధారపడిన అనేకమంది కార్మికులు ఉపాధి కోల్పోయి దారుణమైన జీవితం గడుపుతున్నారు. రైతులకు వెంటనే గిట్టుబాటు ధర కల్పించి, మేత రేట్లను తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్మత్స వెంకట సత్యనారాయణ రాజు, ఎస్‌విివి.సత్యనారాయణ(బుజ్జి), సుధీర్ రెడ్డి, బోనం చినబాబు, బోనం రంగయ్య నాయుడు, దాట్ల సోంబాబు, అంగర వరప్రసాద్, రుద్రరాజు సత్యనారాయణ రాజు, గుంటూరు వెంకట సత్యనారాయణ రాజు, మేక ఫణీంద్ర ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

నేడు పది ప్రతిభావంతులకు సత్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని వెలగలేరు(మార్టేరు) శుభమస్తు కళ్యాణ మండపం ప్రాంగణంలో బుధవారం నరసాపురం డివిజన్‌లోని 10 మండలాలకు చెందిన 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు, ఉత్తీర్ణత సాధించిన హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు అభినందన సత్కారం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంఇఒలు వై.లక్ష్మీ నారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కాకినాడ ఆర్‌జెడి.నాగమణి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి : కలెక్టర్

నరసాపురం ప్రాంతంలో సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - నరసాపురం

గర్భిణులు ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవం చేసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్య పరీక్షలు, చికిత్స అందించేందుకు వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. మంగళవారం ఆమె నరసాపురం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఒపి రిజిస్టర్లు, పలు విభాగాలను, వైద్య సేవలందించే అన్ని వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి వార్డులో చంటి బిడ్డ తల్లులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో డాక్టర్లు ప్రతిరోజూ వచ్చి శ్రద్ధగా చూస్తున్నారా, మీకు సౌకర్యాలు ఎలా ఉన్నాయి, బెడ్‌షీట్లు రోజూ మారుస్తున్నారా అని ప్రశ్నించి సమాచారం తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యాధికారులు, డాక్టర్లు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో గర్భిణులకు ఉచిత అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయడానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ పద్మావతి ముందుకు రావడంపై కలెక్టర్ ఆమెను అభినందించారు. కంటి వైద్యానికి సంబంధించి ఏ స్కాన్ అవసరమని కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా కలెక్టర్ స్పందించి ఏ స్కాన్ కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ విధుల నిర్వహణలో షిఫ్ట్‌వారీగా పనిచేసి రోగులకు మెరుగైన సేవలు అందించేలా చూడాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆర్‌డిఒ, మున్సిపల్ కమిషనర్, ఆసుపత్రి కమిటీ సభ్యులు తరచూ ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. చెవి, ముక్కు, గొంతు ఆపరేషన్లకు సంబంధించి అవసరమైన మిషన్లు వైద్య సేవ నిధుల ద్వారా కొనుగోలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

హాస్టల్ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, డిసిహెచ్‌ఎస్ పి.సూర్యనారాయణ, ఆస్పత్రి కమిటీ సభ్యులు డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ ఎనుమల సతీష్, పోలిశెట్టి నళిని, ఆసుపత్రి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహశీల్దార్ సత్యనారాయణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల మరమ్మతు పనులను సత్వరమే పూర్తి చేయాలి

పట్టణంలో ఎన్‌టిఆర్ కాలనీలో సాంఘిక సంక్షేమ బాలికలు, బిసి సంక్షేమ బాలికల వసతి గృహాలు, చలవపేట బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యమూ లేకుండా అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా హౌసింగ్ జిల్లా అధికారి జి.పిచ్చయ్య పనుల ప్రగతి కలెక్టర్‌కు వివరించారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

స్వయం సహాయక సంఘాల మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పలు గ్రామాల్లో స్వయం సహాయక గ్రూపులు నిర్వహిస్తున్న యూనిట్లను ఆమె ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణేశ్వరంలో పిండి వంటలు, స్వీట్లు తయారు చేసే యూనిట్, సారవ గ్రామంలో మినీ డెయిరీ యూనిట్, తూర్పుతాళ్లులో ఫ్లోర్‌మిల్లు, పచ్చళ్లు తయారు చేసే యూనిట్, చామకూరిపాలెంలో డొక్క తాడు పరిశ్రమను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

కొత్త డిజైన్లు రూపొందించాలి

లేసు అల్లికల్లో వినియోగదారులు అభిరుచికి అనుగుణంగా కొత్త డిజైన్లు రూపొందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. రుస్తుంబాదలోని అలంకృతి లేసు పార్కును ఆమె సందర్శించారు. మహిళలు అల్లిన పలు లేసు డిజైన్లను ఆమె పరిశీలించారు.

పథకాలపై అమలు తీరుపై ఆరా

ఎన్‌టిఆర్ కాలనీలో లబ్ధిదారులకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆరా తీశారు. కాలనీలో నివాసం ఉంటున్న తాడి అనసూయ, లంక కనకదుర్గతో మాట్లాడుతూ మీకు పింఛన్ సొమ్ము ప్రతినెలా అందుతుందా, ఎంత అందుతుంది, ఉచిత గ్యాస్ సిలిండర్ పొందుతున్నారా తదితర అంశాలపై అరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ దాసిరాజు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్‌ఎస్.వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సాంఘిక సంక్షేమ శాఖాధికారి బి.రామాంజనేయరాజు, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ అయితం సత్యనారాయణ, ఎపిఎం నాగభూషణం నాయుడు, సీసీలు, సిబ్బంది ఉన్నారు.

ఎపిఇఎపి సెట్ పరీక్షకు 15 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కళాశాలల్లో ప్రవేశాలకుగానూ నిర్వహించే ఇఎపి సెట్ ప్రవేశ పరీక్ష రెండవ రోజు మంగళవారం తాడేపల్లిగూడెంలోని శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం రెండు పూటలా పరీక్ష నిర్వహించారు. 479 మందికిగానూ 429 మంది పరీక్షకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకరరావు తెలిపారు. పరిశీలకులుగా విచ్చేసిన ప్రొఫెసర్ సుభాష్, టెస్ట్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టిసిఎస్ సంస్థ ప్రతినిధులు పరీక్షా నిర్వహణను పర్యవేక్షించారు. శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎపిఇసెట్ పరీక్ష రెండు షిఫ్ట్‌లలో ప్రశాంతంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ మహమ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. రెండు షిఫ్ట్‌లకు 482 మంది అభ్యర్థులకు గాను 452 మంది అభ్యర్థులు హాజరయ్యారని, 15 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

హాల్‌టికెట్స్ పరిశీలిస్తున్న సిబ్బంది

ట్రాఫిక్ సమస్యతో ఇక్కట్లు


గాంధీబొమ్మ కూడలిలో స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలకేంద్రం మొగల్తూరు గాంధీబొమ్మ కూడలిలో ట్రాఫిక్ సమస్యతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు సాయంత్రం సమయంలో నిత్యావసర సామగ్రి కొనుగోలు, వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రం మొగల్తూరు వస్తుంటారు. అదే సమయంలో విద్యాలయాల నుంచి విద్యార్థులను ఇళ్లకు చేరవేసే వాహనాలు, బస్సులు వస్తుండడంతో పాతకాలువ ప్రాంతం నుంచి గాంధీబొమ్మ కూడలి, మసీదు సెంటరు వరకూ రద్దీ నెలకొంటుంది.

అడ్డుగా వాహనాలు..

రహదారి అభివృద్ధిలో భాగంగా ఎత్తు పెంచి వెడల్పు తగ్గించారు. దీంతో ఆ రహదారిపై వాహనాలు ఎదురెదురుగా వచ్చే సమయంలో తప్పుకునే అవకాశం ఉండటంలేదు. దీంతో పాటు వాహనాలు నిలుపుకునేందుకు జాగా లేక ప్రజలు వాహనాలను రహదారికి అడ్డుగా నిలిపివేస్తున్నారు. దీంతో గాంధీబొమ్మ కూడలిలో సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతుంది.

పరిష్కారానికి చర్యలు

జి.వాసు, ఎస్ఐ మొగల్తూరు

మొగల్తూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాను. సెంటర్ ప్రాంతంలో సిబ్బందిని నియమిస్తాను. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు చేపడతాను.

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న అసోషియేషన్ నాయకులు

జిఒ 4 నుంచి విఆర్‌ఒలకు మినహాయింపివ్వాలి

విఆర్‌ఒల అసోషియేషన్ ఆధ్వర్యాన తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - గణపవరం

జిఒ నెంబర్ నాలుగును వ్యతిరేకిస్తూ గణపవరం మండల విఆర్‌ఒల అసోషియేషన్ ఆధ్వర్యంలో గణపవరం తహశీల్దార్ అప్పారావుకి సోమవారం సాయంత్రం విఆర్‌ఒలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోషియేషన్ అధ్యక్షులు నిడమర్తి కేశవ మూర్తి మాట్లాడుతూ ఇప్పటికే అధిక డ్యూటీలతో అలసి అనారోగ్యంతో విఆర్‌ఒలు ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారన్నారు. దీనికితోడు సచివాలయాలు కేటాయించటం దారుణమన్నారు. జిఒ నాలుగు నుంచి విఆర్‌ఒలకు మినహాయింపివ్వాలని డిమాండ్ చేసారు. ఒక విఆర్‌ఒకి రెండు సచివాలయాలు కేటాయిస్తే ఇప్పటికే విఆర్‌ఒలు మానసికంగా, శారీరకంగా అలసిపోయి ఉన్నారని, దీంతో గుండెపోటు వచ్చి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం తమని జిఒ నాలుగు నుంచి మినహాయింపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న విఆర్‌ఒలు పాల్గొన్నారు.

పల్లెల్లో జనసేన పట్ల పెరుగుతున్న ఆదరణ

విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంఎల్ఎ

జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ సిద్ధాంతాలు, నిజాయితీతో కూడిన స్వేచ్ఛ వాయువులను కోరుకుంటూ స్వచ్ఛందంగా జనసేనలోకి చేరికలు జరగడం శుభ పరిణామమని విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద మాధవరం గ్రామం అరుంధతి పేటకు చెందిన దళిత సంఘ వైసిపి యువ నాయకులను జనసేనలోకి ఆహ్వానించారు. జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 15 కుటుంబాలు చేరారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పల్లెల్లో జనసేనాని ఆశయాలను గౌరవిస్తూ పార్టీలో చేరికలు జరగడం అభినందనీయమన్నారు. గడిచిన 5 సంవత్సరాల గత ప్రభుత్వ పాలనలో పల్లెలు చీకటితో ముసురుకున్నాయని, నేడు కూటమి ప్రభుత్వంలో కొత్త రోడ్లు, విద్యుత్ దీపాలతో పల్లెలు ప్రకాశిస్తున్నాయని అన్నారు. ఇకపై వివాదరహిత పరిపాలనకు ప్రతి ఒక్కరూ చేతులు కలిపి ప్రజా శ్రేయస్సుకు పనిచేయాలని, పార్టీ సిద్ధాంతాలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గ తోడ్పాటుకు కలిసికట్టుగా ముందుకు కదలాలన్నారు. ఈ కార్యక్రమంలో కూడలి ఫణీంద్ర, ఖండవల్లి గోపి, తానేటి శ్యాంబాబు, తిరువీధుల మధు, వెంకటరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

సచివాలయంలో వృద్ధులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రతి నెలా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం

పిహెచ్‌సి వైద్యులు కె.ఓంకార్ నాద్

ప్రజాశక్తి - గణపవరం

ప్రతీనెల సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరుగుతుందని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ కె.ఓంకార్ నాద్ అన్నారు. మంగళవారం స్థానిక మూడవ సచివాలయంలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ పోగ్రాం ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత వైద్యం అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రోగులకు 67 రకాల మందులు, 14 రకాల రక్త పరీక్షలు చేస్తామన్నారు. క్యాంపులో బిపి, షుగరు ఉన్నవారికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే గర్భిణులు, బాలింతలకు, కిషోర్ బాలికలకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ క్యాంపులో 121 మందికి మందులు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు, ఎఎన్ఎం ప్రేమలీల, హెల్త్ అసిస్టెంట్‌లు జి.శ్రీనివాస్, ఆశాలు, అంగన్వాడీలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా యాత్ర

ప్రజాశక్తి - ఆకివీడు

ఆపరేషన్ సిందూర్ విజయానికి చిహ్నంగా జాతీయస్థాయిలో చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలో మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆ పార్టీ నియోజకవర్గస్థాయి మినీ మహానాడు పూర్తయిన అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ ర్యాలీ జరిపారు. కళ్యాణమండపం నుంచి జాతీయ రహదారిపైకి వచ్చి జాతీయ రహదారిపై మూడు రంగుల జెండాలతో, వందేమాతరం నినాదాలతో ఊరేగారు. భారత్ మాతాకు జై అంటూ నినదించారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి రాజశేఖర్, నియోజకవర్గం సమన్వయకర్త నాగబాబు, మండల అధ్యక్షులు మోటిపల్లి రామవరప్రసాద్, పార్టీ నాయకులు గంధం ఉమా సత్యనారాయణ, జంపన్న రాజబాబు, గురువెల్లి అన్నపూర్ణ రఘు ప్రసాద్ పాల్గొన్నారు.

పట్టణంలో దేశాలమ్మ ఊరేగింపు

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న దేశాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా మంగళవారం పట్టణంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రోడ్ గుండా ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో మేళతాళాలతో, బాణాసంచా కాలుస్తూ ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం కురిసిన వర్షం ఊరేగింపుకు ఆటంకం ఏర్పడింది.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యాబోధన

ఎంఇఒలు ఎ.ఉషారాణి, పి.రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఆచంట

ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా, ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన అందిస్తున్నామని ఎంఇఒ-1 ఎ.ఉషారాణి, ఎంఇఒ-2 పి.రాజేంద్రప్రసాద్ అన్నారు. మీ పిల్లల భవిష్యత్తుకు, మానసిక, శారీరక వికాసానికి, సర్వతోముఖాభివృద్ధికి ఎంతో దోహదపడే ప్రభుత్వ పాఠశాలలో నేడు మీ పిల్లలను చేర్పించాలని, ఒత్తిడి లేని నాణ్యమైన విద్యను అందించి మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా బిఇడి, ఎంఎస్‌సి, డిఎడ్ వంటి అధ్యాపక బృందంచే విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నిరంతరం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. అనుభవం, అంకితభావం, విద్యార్థులను ఉత్తేజితులను చేసే విద్యాబోధన అందించడం మా ప్రభుత్వ పాఠశాల అధ్యాపక బృందం ప్రత్యేకత అన్నారు. బట్టీ పట్టే విధానం కాకుండా సబ్జెక్టుపై పూర్తి అవగాహన వచ్చే విధంగా ఆయా సబ్జెక్టులలో నిరంతరం శిక్షణ ఇస్తామన్నారు.

ముప్పన వీర రాఘవులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1901లో ప్రారంభమై ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాల చదివిన విద్యార్థులు సైంటిస్టులు, కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్‌డిఒ, తహశీల్దార్, ఎంపిడిఒ, ఉపాధ్యాయులు గాను అనేక ప్రభుత్వ శాఖలలో కొలువుల్లో ఉన్నారని తెలిపారు.

ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 544 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, 22 మంది ఉపాధ్యాయులు ఇద్దరు ఆఫీస్ సిబ్బందితో 2024-2025 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు. మండలంలో వల్లూరు ఎంపీ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పిఎస్.శ్రీలేఖ 583 మార్కులతో


విశాలమైన ఆటస్థలం

ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు..

1. ఉచిత విద్య
2. తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం.
3. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర ద్వారా మూడు జతల నూతన యూనిఫామ్, స్కూల్ బ్యాగులు, షూస్, సాక్స్, టెక్స్టబుక్స్, నోట్‌బుక్స్, స్వచ్ఛమైన ఆర్వో నీటి సదుపాయం, ఆధునిక మరుగుదొడ్లు, రక్తహీనత నివారణకు రాగిజావ చిక్కిలు, నెలకొకసారి వైద్య పరీక్షలు, ఐరన్ పోలిక మాత్రలు, నులిపురుగుల నివారణకు మాత్రలు, విద్యార్థులకు కంటి పరీక్షలు, ఉచితంగా కళ్ళజోళ్ళ పంపిణీ.

మండలంలో ఫస్ట్ ర్యాంక్ సాధించిందన్నారు. ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కరుగోరుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.యువరాజు, వైజెఎస్.గణపతి ద్వితీయ స్థానాలు సాధించారని తెలిపారు. మండలంలో మొత్తం 81 శాతంతో పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి కార్పొరేట్

ఎంవిఆర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకతలు..

1. క్వాలిఫైడ్, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన
2. విశాలమైన తరగతి గదులు, ఫర్నిచర్
3. 100 శాతం ఇంగ్లీష్ మీడియంలో బోధన
4. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా డిజిటల్ విద్యాబోధన
5. స్మార్ట్ టివిల ద్వారా డిజిటల్ కంటెంట్ అందించడం
6. అత్యాధునిక ఆట స్థలాలు, ఇండోర్ కోర్టులు
7. మ్యాథమెటిక్స్ ల్యాబ్‌ల ద్వారా ఉత్తమ శిక్షణ
8. అటల్ టింకరింగ్ లేబుల్ ద్వారా సైన్స్ ప్రయోగాలు

పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

ఐఎఫ్‌బి ప్యానల్స్ ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన, లైబ్రరీ సౌకర్యం, మ్యాథమెటిక్స్ పిఎల్ ల్యాబ్స్ ద్వారా మాములు లెక్కలతో పాటు సులభంగా నేర్చుకునే విధానం. రూ.30 లక్షల విలువ గలిగిన ఐఎఫ్‌బి ప్యానల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం రూ.5 లక్షల విలువ కలిగిన ఆర్వో వాటర్ సౌకర్యం, విశాలమైన మరుగుదొడ్లు, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ ఎగ్జామ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున ఇంటర్మీడియట్ స్థాయి వరకు ఉచితంగా స్కాలర్‌షిప్ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచితంగా అడ్మిషన్లు జరుగుతున్నవి. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బంగారు భవిష్యత్తు కోసం బడివైపు అడుగులు వేయాలని వారు కోరారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వ్యకాస ఆధ్వర్యాన సచివాలయాల వద్ద ఆందోళన

యలమంచిలిలో..

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని ఆర్యాపేట, పెనుమర్రు, ఏనుగువానిలంక, చించినాడ గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో ఆయా గ్రామ సచివాలయాల వద్ద మంగళవారం ఉపాధి హామీ కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు మాసవరపు సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పని, రూ.600 వేతనం, ప్రమాదబీమా రూ.25 లక్షలు, పనిప్రదేశంలో మెడికల్ కిట్లు, పే స్లిప్‌లు, జాబుకార్డులు, పోస్ట్ ఆఫీస్ ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరుతూ సచివాలయం దగ్గర నిరసన తెలిపారు. ఆయా పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో మహాలక్ష్మి, ఇందిర, మోహనరావు పాల్గొన్నారు.

పాలకోడేరు : ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు ఆశ్రియ్య అన్నారు. పెన్నాడ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తన సమస్యలు పరిష్కరించాలని మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రియ్య మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం సాగిస్తుందన్నారు. దీనిలో భాగంగానే బడ్జెట్లో కోతలు విధించారని తెలిపారు. ఉపాధి కూలీగా ఉన్న ప్రతి ఒక్కరికి 200 రోజులు పనులు కల్పించాలని, అలాగే రోజుకు కనీస వేతనం రూ.600 అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

సమాజంలో లింగ వివక్షను రూపుమాపాలి

సిడిపిఒ అంగర కృష్ణకుమారి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆడపిల్లల పట్ల అందరి వైఖరిలో మార్పు రావాలని, సమాజంలో లింగ వివక్షత లేకుండా చూడడం అందరి బాధ్యతని పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి అంగర కృష్ణ కుమారి అన్నారు. మంగళవారం కిశోరి వికాసం వేసవికాల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మండలంలోని భట్లమగుటూరు, పెనుమంట్ర, మార్టేరు 5, 6 అంగన్వాడీ కేంద్రాల్లో బాలికలకు ఆడపిల్లల పట్ల లింగవివక్ష, భ్రూణ హత్యలు, అసమానతలు గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్‌లు టి.పోశమ్మ, ఎస్.వెంకటలక్ష్మి, పి.వరలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశలు, అంగన్వాడీలు, సహాయకులు పాల్గొన్నారు.

ఆకివీడు : బాల్య వివాహాలను ఆదిలోనే గుర్తించి నివారించాలని బాలల సంరక్షణ జిల్లా అధికారి ఎస్.రాజేష్ సూచించారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకోడేరు మండలాల పరిధిలోని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు స్థానిక మండల కార్యాలయంలో మంగళవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేష్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బాల్య వివాహాల నిరోధక అధికారులకు స్థాయి పరంగా వారి బాధ్యతలను విడివిడిగా వివరించారు. గ్రామస్థాయి బాలల సంరక్షణ కమిటీలో 11 మంది సభ్యులు ఉంటారన్నారు. ప్రతి మొదటి, 3వ శుక్రవారం ప్రతి సచివాలయంలో అందరూ అధికారులు సమస్యలు ఉన్నవారితో సమావేశాన్ని నిర్వహించి సమస్యలు చర్చించాలన్నారు. చర్చల ఫలితాలను పైఅధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించుకునే సమావేశాల్లో కిషోర్ బాలికల అవగాహనపై చర్చించాలన్నారు. కిషోర బాలికల్లో ముందుగానే బాల్యవివాహాల అనర్థాలు గురించి అవగాహన కల్పిస్తే అసలు బాల్యవివాహాలను మొదట్లోనే ఆపే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ సంస్థకు చెందిన శ్రీనివాస్ బాలికల అక్రమ రవాణా, భాల కార్మికుల నివారణ, పోక్సో చట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఆకివీడు ప్రాజెక్టు సిడిపిఒ వి.వాణీ విజయ రత్నం, సూపర్వైజర్లు పిఆర్.రత్న కుమారి, నాగలక్ష్మి, జి.పార్వతి, సిహెచ్.హేమలత పాల్గొన్నారు.

పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ డివివిఎస్.అశోక్ వర్మకి వినతి

ప్రజాశక్తి - తణుకు

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న నాయకులు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు పట్టణంలో ఉన్న పేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలను అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ డివివిఎస్.అశోక్ వర్మకి డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల సమస్యలపై సైకిల్‌యాత్ర నిర్వహించిందన్నారు. జిల్లాయాత్ర మండలంలో పర్యటించినప్పుడు గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల లబ్ధిదారులు సమస్యలు చెప్పారన్నారు. టిడ్కో ఇళ్లు నేటికీ పూర్తి కాకపోవడం వల్ల లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. గత వైసిపి ఇచ్చిన సెంటు స్థలానికి ప్రభుత్వ సహాయం రూ.1.80 లక్షలు సరిపోదని సిపిఎం వ్యతిరేకించిందన్నారు. ఇంటి నిర్మాణానికి కనీసం రూ.5 లక్షల ప్రభుత్వ సహాయం చేయాలన్నారు. వివిధ రకాల ప్రభుత్వ భూమిలో ఉన్న వారికీ పట్టాలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన సహాయం చాలక, అప్పులు చేయలేక చాలా మంది ఇళ్లు కట్టలేదని తెలిపారు. కట్టుకోని వారి ఇళ్ల రిజిస్ట్రేషన్ కాన్సల్ చేసి వారికి కూడా 2 సెంట్లు ఇవ్వాలని అన్నారు. 1980కి ముందు ఇచ్చిన కాలనీ ఇళ్లు శిథిలం అవుతున్న నేపథ్యంలో ఉచితంగా కట్టి ఇవ్వాలని తెలిపారు. ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణికి సైకిల్ యాత్రలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని ఇచ్చిన లెటర్ అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుబ్బల గోపి, బ్రహ్మాజీ, శ్రీను, రవి, రమేష్, నాగరత్నం పాల్గొన్నారు.

పారదర్శకంగా రీ సర్వే

ఉండి : పారదర్శకంగా జరుగుతున్న రీ సర్వేతోనే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఉండి మండల తహశీల్దార్ కావడి నాగార్జున అన్నారు. మంగళవారం ఉండి మండలం మహదేవపట్నం గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వేను నాగార్జున పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి వారి పత్రాల్లో ఉన్న భూముల విస్తీర్ణం సరిపోయిందో, లేదో తెలుసుకునేందుకు రీసర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులకు ముందస్తుగా సమాచారం ఇవ్వడం వల్ల వారి స్థలాలు, పొలాలు సర్వే జరిగే సమయంలో అందుబాటులో ఉండేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. సమస్యలుంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు. రీసర్వే సమయంలో రైతులందరూ అధికారులకు సహకరించాలన్నారు. విఆర్‌ఒ ఎస్.చిన్నారావు, గ్రామ సర్వేయర్ గంగామోహన్ ఉన్నారు.

బలహీన తరగతులకు రాజ్యాధికారం లక్ష్యంగా టిడిపి స్థాపన

మినీ మహానాడులో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్

ఆకివీడు : మాట్లాడుతున్న ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్

ప్రజాశక్తి - ఆకివీడు

బలహీన తరగతులకు రాజ్యాధికారం లక్ష్యంగా నాడు ఎన్‌టి రామారావు టిడిపిని స్థాపించారని ఆ పార్టీ ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో టిడిపి నియోజకవర్గస్థాయి మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి రామవరప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సభలో రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. టిడిపికి కార్యకర్తలే బలమని, ఆ పార్టీకి వారు కొండంత అండ అని ఆయన అన్నారు. బలహీన తరగతుల అభివృద్ధి, సంక్షేమం తమ పార్టీ వల్ల మాత్రమే జరుగుతుందన్నారు. రాష్ట్రం విడిపోయి రాజధాని కూడా లేకుండా కష్ట కాలంలో ఉన్న సమయంలో చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టారని, ఆనాడు అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. అయితే ఒక్కసారి ఓటు పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ మాత్రం రాష్ట్రం నాశనం చేశారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నాగబాబు, టిడిపి జిల్లా కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్, మోటుపల్లి రామ వరప్రసాద్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో ఏ విధమైన అభివృద్ధికి నియోజకవర్గం నోచుకోలేదన్నారు. మరో ఆరు మాసాల్లో పంచాయతీకి ఎన్నికలు రానున్న దృష్ట్యా అభివృద్ధి లక్ష్యంగా మనం పయనించాలన్నారు. అనంతరం ఉచితంగా అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్న పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజును సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కూటమి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొల్ల వెంకట్రావు, గొంట్ల గణపతి, గంధం ఉమా సత్యనారాయణ, సుజాత, నౌకోట్ల రామారావు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ఆచంట : టిడిపికి త్యాగాలు చేసిన వారిని గుర్తించి భవిష్యత్తులో వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంట నియోజకవర్గం టిడిపి మినీ మహానాడు కార్యక్రమం స్థానిక కమ్మ సంఘం కళ్యాణ మండపంలో మంగళవారం జరిగింది. జోరున వర్షం పడుతున్న నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మినీ మహానాడుకు తరలివచ్చారు. ముందుగా టిడిపి జెండాను పితాని ఆవిష్కరించారు. అనంతరం కీర్తిశేషులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇటీవలే ఉగ్రవాది దాడిలో మృతిచెందిన వారికి ఘనంగా నివాళులర్పించారు. సభలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టి వాటిని ఆమోదించారు. ఎంఎల్ఎ పితాని వేదికపై నియోజకవర్గంలోని గ్రామస్థాయి కమిటీలను ప్రకటించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు రుద్రరాజు వెంకటరామరాజు, ఆచంట జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, కేత మీరయ్య, తమ్మినీడి ప్రసాద్, బడేటి బ్రహ్మాజీ, నక్క శ్యామల సోని, తమనంపూడి శ్రీనివాసరెడ్డి, వెలగల బుల్లి రామిరెడ్డి, చింతపల్లి రామకృష్ణ, వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్, గణపతినీడి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆచంటలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

వాతావరణ మార్పులతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో 6.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జెసి

ప్రజాశక్తి - భీమవరం

వాతావరణ మార్పులతో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 6.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ధాన్యం కొనుగోలు సేకరణ, భద్రతపై జిల్లా డివిజన్, మండల స్థాయి కమిటీలతో జిల్లా జాయింట్ కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. వర్షాభావం కారణంగా ఎఎంసి గోదాములలో భద్రపరచాలని, తార్పాలిన్‌తో ధాన్యాన్ని కప్పి భద్ర పరచాలని అన్నారు. మండలస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. మండల స్థాయిలో ఇచ్చిన నివేదిక ప్రకారం ధాన్యం కొనుగోలు లక్ష్యాలను కేటాయించడం జరిగిందన్నారు. గోనే సంచుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడటం జరిగిందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే రైతుసేవా కేంద్రాలు, మండల స్థాయి అధికారులు లేదా జిల్లా టోల్ ఫ్రీ నెంబర్ 8121676653, ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ గూగుల్ మీట్‌లో డివిజన్ అధికారులు, జిల్లా సివిల్ సప్లయ్ డిస్టిక్ మేనేజర్ టి.శివరామప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా కోపరేటివ్ అధికారి నాగరాజు, డిఎస్ఒ ఎన్.సరోజ, జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులు, తహశీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పిల్లలు దేశనాయకుల చరిత్ర తెలుసుకోవాలి

గ్రంథాలయాల్లో కొనసాగిన వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

దేశం కోసం త్యాగాలు చేసిన దేశ నాయకుల గురించి పిల్లలు తప్పక తెలుసుకోవాలని లైబ్రేరియన్ పిటి.శివకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 22వ రోజు కార్యక్రమంలో భాగంగా పిల్లలకు దేశ భక్తుల, దేశ నాయకుల చరిత్ర గురించి వివరించి పుస్తకాలు చదివించారు. ఈ శిబిరంలో విశ్రాంత ఉపాధ్యాయిని పి.సువర్ణ గౌరి పిల్లలకు ఇంగ్లీష్ సంబంధించి విషయాలు తెలియజేసి చదివించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో మనోహర్, కె.ఝాన్సీ, టి.దీరజ్, ఎస్.జస్మిత, టి.తరుణ్ కూమార్, జి.విమోగ్, టి.లోకేష్ పార్థు, ఎం.కార్తీక్ స్వరూప్ రెడ్డి పాల్గొన్నారు.

నరసాపురం : ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. మంగళవారం విద్యార్థుల చేత గౌతమ బుద్ధుడు, సర్దార్ వల్లభాయ్ పటేల్, దేశ నాయకుల జీవిత చరిత్రల గురించి వివరించి, చదివించారు. పిల్లల చేత కథలు చెప్పించడం, పుస్తక సమీక్ష గురించి తెలియజేశారు. శాస్త్రవేత్త సుబ్బారావు గురు శిష్యుల కథను చెప్పి వాటర్ సైకిల్ నీటి వలయము నిత్యత్వ సూత్రములు, ప్రకృతి పరిరక్షణ, ఖగోళ పరిశోధనలు వీటిని గురించి చర్చించారు. శ్రీనివాస్ గణితములో మెలకువలు, జికె, భట్టిప్రోలు సత్యనారాయణ హిందీ క్లాసులో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూర్యం బాబు, సిహెచ్.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రేడ్‌వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి పర్యవేక్షించారు.

నరసాపురంలో..

పేరు మార్పు / సవరణ

నేను లక్కు సావిత్రి, W/o లక్కు ఏడుకొండల శ్రీనివాసు (లేట్), నివాసం : డోర్ నెం.25-16, కొత్తకాయల తిప్ప, మొగల్తూరు, పశ్చిమగోదావరి జిల్లా. ప్రస్తుత ఆధార్‌లో నా కుమార్తె పేరు లక్కు నాగ దుర్గ మహేశ్వరి అని తప్పుగా నమోదు కాబడినది. ఇప్పుడు 10వ తరగతి మార్కుల జాబితా ప్రకారం పేరు సవరణ చేయగా **లక్కు నాగ దుర్గాదేవి D/o లక్కు ఏడుకొండల శ్రీనివాసు (Lakku Naga Durga Devi, D/o Lakku Edukondala Srinivasu)** గా మార్పు చేయుట జరిగినది. ఈ రోజు నుంచి నా కుమార్తె పేరు **లక్కు నాగ దుర్గాదేవి** గా పిలవబడును.

డాక్యుమెంట్లు పోయినవి

పెదవేగి మండలం కొప్పాక గ్రామం నుంచి శనివారం ఏలూరు వస్తుండగా మార్గమధ్యంలో నాకు చెందిన స్థలం డాక్యుమెంట్లు పోయినవి. మూడు రోజులుగా వెతికినా అవి దొరకలేదు. ఎవరికైనా దొరికితే అందించవలసిందిగా కోరుచున్నాను.

డాక్యుమెంట్ నంబర్ : 6807/1992

అడ్రస్ : BH .వాసు, s/o. రామలింగేశ్వరరావు(లేట్) కొప్పాక (పోస్ట్), పెదవేగి మండలం pin no : 534003 Phone no : 94934 76956, 93460 66909.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, ఏలూరు మండలం కాపురస్తులు **మానికల సందీప్ కౌశిక్** తండ్రి **మానికల వెంకటేశ్వరరావు** అనునేను వ్రాయించియిచ్చిన అఫిడవిట్ నా తల్లి గారైన (లేటు) **మానికల నందగౌరి** గారి తాలూకా ఏలూరు జిల్లా, ఏలూరు నరసింహారావు పేట, ఆర్.వి రామారావు వీధి.ఆర్.ఎస్.నెం. 5567/1989, 5568/1989లో 207 చ.గజములు నివాస భూమికి చెందిన ఏలూరు రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిస్ట్రీ పొందిన లింక్ డాక్యుమెంట్స్ తేది.04.10.1989 గల లింక్ డాక్యుమెంట్‌ను ది.12.04.2025 తేదిన వట్లూరు నుండి ఏలూరు వస్తుండగా పైన తెలిపిన డాక్యుమెంట్ మార్గమధ్యలో పొగొట్టుకొవడం జరిగినది. ఎవరికైన దొరికిన యెడల ఈ నెంబరుకు తెలుపగలరని కొరుచున్నాను. **మానికల సందీప్ కౌశిక్** తండ్రి: **మానికల వెంకటేశ్వరరావు** సెల్ : 63054 52492